375) నాదరామక్రియ

ప॥ ఎంతకత నడిపితి వేమి జోలి బెట్టితివి । చింతించ లోకములు నీచేతివే కావా ॥

చ॥ కౌరవుల బాండవుల కలహము పెట్టనేల । నేరిచి సారథ్యము నెఱపనేలా ।
కోరి భూభార మణచేకొరకైతే నీచే చక్ర- । మూరకే వేసితే దుష్టు లొక్క మాటే తెగరా ॥

చ॥ చేకొని వానరులుగా జేయనేల దేవతల । మూకతో లంకాపురి చుట్టుకోనేల ।
కాకాసురు వేసినకసవే రావణుమీద- । నాకడ జంపువెట్టితే నప్పుడే సమయడా ॥

చ॥ గక్కన శ్రీవేంకటేశ కంబములో పెళ్ళనేల । చొక్కముగా బ్రహ్లాదుడు చూపగనేల ।
చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక । తక్కించి నీవెడసితే తానే పొలియడా ॥